కాళ్ళు చాపుకొని సోఫాలో పడుకొని పేపరు చదువుకుంటు న్నాడు. "ఏమిటి విశేషం" అని అడుగుతాడనీ, అప్పుడతనికి తన గొప్పదనం అతి డ్రమెటిక్ వర్ణించి చెప్దామని ఆశించిన పద్మకి అతని వాలకం పిచ్చికోపం తెప్పించింది.

ఛీ ... ఛీ.... ఏం మగాళ్ళు? డబ్బుండగానే సరా టేస్ట్ వుండొద్దూ? నిజంగా తను చెయ్యబోయే పనికి అతను ఎంకరేజ్ చేస్తే ఎంత బావుంటుంది? కానీ అసలు ప్రపంచంలో ఏ మొగాడు ఏ ఆడదాన్ని – ముఖ్యంగా పెళ్ళాన్ని ఎంకరేజ్ చేసేడు? నెవర్.

అసలేం చెప్పకూడదు ఇతనితో, ఎందుకూ చెప్పడం? మంచి పని చెయ్యడానికి ఒకరి పర్మిషన్ దేనికి? ముందుగా చెప్పడం కంటే ఒక్కసారే సర్‌ప్రైజూ, సస్పెన్సూ కలుగచెయ్యాలి.

ఏవో ఆలోచిస్తూ అడుగుల చప్పుడికి తలెత్తిన పద్మ ఎదురుగా నిల్చున్న ఆ అమ్మాయిని జూసి ఆశ్చర్యపోయింది.

"ఏ అలంకరణా లేకపోతే యిం అందంగావున్న యీ పిల్ల అందం అన్నీ అమరిస్తే ఎవరాపగలరు?" అనుకుంది.

సరిగ్గా అదే సమయంలో అదే అడుగుల చప్పుడికి తలెత్తి పేపరు కింద నుండి కాజువల్‌గా చూసిన ప్రభాకర్రావు కళ్ళతో గమ్మత్తయిన మెరుపు మెరిసింది. ఆ మెరుపు చూసిన పద్మకి వెంటనే "వాట్ ఎ బ్యూటీ" అన్న అతని మాటలు పిడుగుల్లా వినిపించేయి. ఆవిడ అరసెకండు కాలం అతని వేపు, ఆ అమ్మా యివేపు మార్చి మార్చి చూసింది. ఆ అరసెకండులో ఆవిడకిఎన్ని యుగాల చరిత్ర కనిపించిందో కానీ ఏం మాట్లాడకుండా పక్క గదిలోకి వెళ్ళిపోయింది. పేపరు చదువుకోవటమో, ఆ అమ్మా యిని మళ్ళీ చూడ్డమో తేల్చుకోలేని ప్రభాకర్రావు పద్మ వెళ్ళినవేపే చూస్తూ కూర్చున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత పనిమిషి వచ్చి ఆ అమ్మాయి చేతిలో ఒక మూడు రూపాయలు పెట్టి పంపించేసింది.

(ఎప్పుడో, ఎక్కడో యిలాంటి కథ చదివిన జ్ఞాపకం, లేక కనగన్నానో)

**(జ్యోతి, దీపావళి 10.11.1973)**

# ది స్మోకింగ్ డాగ్

**ఆ** సాయంత్రం చాలా అద్భుతంగా వుంది. జీవితమంతా యిలాంటి సాయంత్రాలే అయితే ఎంత బావుంటుంది. బంగారు సూర్యుడు అప్పుడే అస్తమిస్తున్నాడు. ఆకాశమంతా సముద్రమా అన్నంత నీలిగా వుంది. దూరంగా నదిలో వెళ్తున్న పడవ తేల్తున్న మబ్బు ముక్కలా వుంది. సరుగుడు తోటలో నుంచి వస్తున్న చల్లగాలి చల్లటి సెంటువాసనలు పరుస్తోంది. ఇంకా చీకటి పడకుండానే వెలిగించిన వీధి దీపాలు లేత నక్షత్రాల్లా వున్నాయి. తనమీద మనిషికి యింకా నమ్మకం పోకుండా వుండడానికేమో భగ వంతుడు అప్పుడప్పుడు అలాంటి సాయంత్రాలు సృష్టిస్తాడు!

చిక్కటి చీకటి నల్లని తివాసీని భూమ్యాకాశాల మీద పరుస్తూ వుంటే చూస్తూ నిల్చున్నాను బాల్కనీమీద. హడావిడిగా యింటికి పారిపోతున్న పశువుల్లా వున్నాయి. రోడ్డుమీద పోతున్న కార్లు, నేను ప్రతిదానికీ విమర్శించే మొగుడ్నీ, ప్రతిదానికీ ఆర్గ్యుమెంట్ చెప్పి, చెప్పిన మాట వినని పిల్లల్ని, విప్లవకారుడులాంటి కుక్కనీ, జీతం అంతా రిపేరుకే తినేసే డొక్కు కారునీ, ఉడికీ ఉడకని వంటనీ–అన్నింటినీ మరిచి పోగలిగి, ప్రపంచాన్ని మరచి బీచిలో ఆల్చిప్పలేరుకునే చంటి పిల్లాడిలా అలా ఎంతసేపు నిల్చున్నానో నాకే తెలీదు.

ఇంతలో కింద కాంపౌండులో గంపెడు గవ్వలు ఒక్కసారి ఒలికినట్టు గలగల నవ్వులు వినిపించగానే కిందికి చూసేసరికి మా కుర్రడాక్టర్ల గ్రూపు వచ్చేసింది. మా పిల్లలంటే నాకెంత యిష్టమో వీళ్ళన్నా నాకంతే ఇష్టం. ఎంతో అమాయకంగా, నిస్సహాయంగా కనిపించే వీళ్ళు ఎంత భయంకర ప్రపంచంలో ఎలా బ్రతకగలరో అని ఆలోచిస్తే విపరీతమైన జాలి, భయం వేస్తాయి నాకు. మెడిసన్‌తో సహా ప్రపంచంలో ఎన్నో విషయాల గురించి తెలీని వీళ్ళు అన్నీ తెలుసనుకుంటారు. "నాయకుళ్ళు ల్లారా! మీకు తెలీని ప్రపంచం చాలా వుంది. మీరింకా అర అదివారం నక్కలు అని నేనెన్నోసార్లు చెప్పినా వాళ్ళు వినరు. వాళ్ళలోని ఆ పసితనమే నాకు చాలా ఇష్టం.

వాళ్ళని రిసీవ్ చేసుకోవడానికి గబగబా కిందికి దిగే సరికి వాళ్ళప్పుడే డ్రాయింగు రూములో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరికీ ఒకే స్వాగతం నవ్వు పారేసి

సిగరెట్టు కేసు, లైటరు ఆఫర్ చేసేను. కాఫీ ఇవ్వడానికి పాలు సరిపోతాయో లేదో పోనీ కూల్‌డ్రింక్స్ యిద్దామా అని ఆలోచిస్తూ...

"సిగరెట్ ఆడదాన్లాంటిది. అనుభవించేక కలిగేది అసంతృప్తే" అని బెర్నార్డ్ షావో, ఆస్కార్ వైల్డో అన్నారు. ఒకవేళ వాళ్ళనకపోతే నేనంటున్నాను" అన్నాడు కృష్ణమూర్తి. అందుకే నేను సిగరెట్లు మానేశాను అని కూడా కలిపేడు. అతను ప్రతి మాటకీ ముందు ఏదో ఒక కొటేషన్ వాడతాడు అతన్ని డాక్టర్ క్రిష్ణమూర్తి అని కానీ, క్రిష్టమూర్తి డాక్టరని కానీ మేమెవ్వరం అనం, అసలతను డాక్టరన్న మాట మాకు జ్ఞాపకం రాదు. ఎంచేతంటే అతను డాక్టరు కాకపూర్వం నుంచీ మాకు తెలుసు.

"నిజంగా?" మూర్ఛవస్తున్నట్టు అరిచేడు సత్యన్నారాయణ. ఆ టైములో అతని చేతిలో ఏదీ హత్యాయుధం లేకపోవడం కేవలం కృష్ణమూర్తి చేతిలో వున్న జెర్రిపోతు లాంటి లైఫ్‌లైన్ గొప్పతనమే.

"సిగిరెట్లు మానేయడం చాలా తేలికలేవోయ్. నేను లక్షసార్లు మానేశాను", అన్నాడు గోపాలరెడ్డి నవ్వుతూ అతను సిగిరెట్ అన్నప్పుడల్లా సిగరెట్ అని కరెక్టు చేస్తారు. హత్యానేరమైనా క్షమిస్తారు కాని తప్పు ప్రొనన్సియేషన్ మాత్రం క్షమించలేని – మా వారు.

చంద్రమోహన్ అవాక్కైపోయేడు. స్వతహాగా అతను మాట్లాడడు. కేవలం తను మూగవాడు కాదని తెలియడాని కన్నట్టు అప్పుడప్పుడు 'అవును' 'లేదు' 'కాదు' అని మొత్తం అతనన్న నాలుగ్గంటల్లో నాలుగు మాటలు మాట్లాడతాడు. అలాంటివాడు ఈ షాక్‌తో కంప్లీట్ మూగవాడైపోయాడు.

సర్వనాశనం అయిపోయిన తరువాత ఏర్పడే నిశ్శబ్దంలా అయిపోయింది వాతావరణం. క్రిష్ణమూర్తి తను అప్పుడే ఎవర్నో చంపేసి శవాన్ని తినేసి వచ్చానన్నా కూడా మాకందరికి అంత షాక్ కలిగించి వుండపోను.

'అబద్ధం, శుద్ధ అబద్ధం" అని అవరడం ప్రారంభించింది, మా కుక్క క్రిష్ణమూర్తి దగ్గర నిల్చుని.

అసలు మా కుక్క పెద్ద పండితుడో, స్కాలరో అని నా ఉద్దేశం. మేము పాలిటిక్స్ దగ్గర్నుంచి పాప్ మ్యూజిక్ వరకు అన్ని డిస్కషన్స్ దగ్గర్నుండి జాగ్రత్తగా వింటుంది. దానికి కేపిట లిజమ్, డెమోక్రసీ వగైరా విషయాల మీద చాలా ఇంటరెస్టు. ఆ విషయాల గురించి పాలు మానేసి కూడా గంటల తరబడి డిస్‌కషన్స్ వింటుంది. కాని ఇలారా, పో, స్నానం చెయ్యి, పాలు తాగు వగైరా చిన్న మాటలు దాని కర్థం కావు. కాని నా అనుమానం ఏమిటంటే అది అర్థం చేసుకుంటుంది కానీ, చెప్పినట్టు చెయ్యడం ఇష్టంలేక విన్ననట్టూ, విన్నా అర్థం కానట్టూ నటిస్తుందేమోనని. కారణాలేవైనా చాలా ఇండివిడ్యుయాలిటీ వున్న కుక్క దానికి తోచినదే తప్ప ఒకరు చెప్పినట్టు ఛస్తే వినదు.

అసలది మాకెలా దొరికిందంటే – కాదు మేమే దానికెలా దొరికేం అంటే–కొన్నాళ్ళ కిందట మాపక్కింట్లో ఒక ముసలావిడ వుండేది. ఆవిడ వయస్సులోనే ముసిలి కాని శారీరకంగా నాలాంటి వాళ్ళు పదిమందిని ఎడంచేత్తో ఎగరేసీగలదు. ఆవిడకి మొగుడు లేదు. (చచ్చిపోవడం కాదు, కాని బతికేడు అంటారు మా వారు) అంచేత కాలక్షేపానికి సింహంలాంటి ఆల్సేషియన్‌ని పెంచేది. ఉన్న ముగ్గురు కొడుకులూ మిలటరీలోకి పోయేరు. అందువల్ల ఓ రెండు చిలకల్ని కూడా పెంచేది పంజరంలో. మేము ఆమె పక్కింట్లో చేరిన కొత్తలో నేనోసారి వాళ్ళింటికి వెళ్ళేను. పరిచయం చేసుకుందాం పోనీ పెద్దావిడ కదా ఎందుకైనా పనికొస్తుందని. ఆవిడ నిన్ను తన్నడానికి తప్ప ఎందుకూ పనికిరాదని మావారు హేళన చేసేవారు. నా వెనకాలే మా చిన్ని కూడా వచ్చేడు. వచ్చినవాడు వచ్చినట్టు వుంటే యింత కథ జరక్కపోను నెమ్మదిగా చిలక పంజరం దగ్గరచేరి ఎవరూ చూడనప్పుడు నెమ్మదిగా పంజరం తలుపు తీసేశాడు. కేవలం ఆ చిలకల్ని పట్టుకోవడమే వాడి ఉద్దేశం అయినప్పటికీ వీడిచేత పట్టించుకోవాలన్న కోరిక ఆ చిలకలకి లేకపోవడం వల్ల అవి సర్రున ఎగిరిపోయేయి. ఆ ముసలావిడ మనసులో ఏమనుకుందో కాని పైకి మాత్రం పోన్లే బాబూ ఫరవాలేదు అంది. పైకి అలా కనిపిస్తుంది. పాపం మంచిదే అనుకున్న నాకు ఆవిడ మంచితనంలోని అసలు సంగతి మరో నెల్లాళ్ళగ్గాని అర్థం కాలేదు.

ఒక నెల పోయేక ఓనాడు మా చిన్ని ఒక నల్లటి గొంగళీ లాంటి వస్తువుదేన్నో అతి భద్రంగా రెండు చేతుల్తోను పట్టుకొచ్చి కుర్చీలో దింపేడు. ఎలుగుబంటిపిల్ల నీ కెక్కడ దొరికిందా అన దగబోయిన నాకు పక్కింటి ఆవిడ ప్రెజెంట్ చేసిన కుక్కపిల్ల అని వాడు నచ్చచెప్పేడు. చూడ్డానికి బొద్దుగా, అందంగా వున్న మాట నిజమే కాని అదేందుకో నాకు నచ్చలేదు. ముఖ్యంగా దాని కళ్ళు, అంత మిస్చివస్ కళ్ళు నేనెక్కడా చూడలేదు. నాకెందుకో దాని కళ్ళు నాగుపాము కళ్ళలా క్రూరంగానూ, కొంద

చిలువ కళ్ళలా బద్ధకంగానూ కనిపించేయి. "వెధవ కుక్కని ఇచ్చేసిరా" అందామనుకున్న నన్ను–వాడి మొహంలో కనిపించిన సంతోషం అలా అననివ్వలేదు. వాడి ఈ అతి చిన్న సహజమైన కోరిక – తీర్చకపోవడం కేవలం క్రూరత్వం అనిపించింది. దాని చిన్నతనం ఏవంత చెప్పుకోదగ్గది కాదు – ఆకలేసినప్పుడు ఏవడం – ఏడవనప్పుడు నిద్రపోవడం మినహా.

దానికి పేరు పెట్టడం విషయంలో మా పిల్లల మధ్య చాలా దెబ్బలాటలు జరిగేయి. అది కొంచెం పెద్దయ్యేక దాని గుణాల్ని బట్టి పేరు పెడదాం అన్నారు మావారు. దాని కున్న గుణం ఒక్కటే. కనిపించినవన్నీ కొరికేసి చింపేయడం ఆ కనిపించే వాటిలో గలేబులు, జోళ్ళు, బంతులూ, లేసుకర్టెన్లు అంటే కొంచెం ఎక్కువిష్టం.

"మేజర్ అని పెడదాం" అన్నాడు ఆఖరివాడు చిన్ని. వాడికి మిలటరీలో చేరాలని కోరిక – ఎవరో చెప్పేరుట మిలటరీలో చేరడానికి ఎక్కువ చదువు అక్కర్లేదు. టెన్త్ క్లాస్ చాలని.

"తప్పకుండా పెడదాం, ఎటొచ్చీ మేజర్లందరూ నల్లగా వుండి ఆకలేసినప్పుడు చెప్పులు తింటే. జోక్ చెయ్య బోయేడు మొన్ననే కాలేజీలో చేరిన పెద్దవాడు.

చిన్నికి కుక్కకి మేజర్ అని పెట్టాలనుంది. కాని మేజర్లు జోళ్ళు తినరుట. పెద్ద చిక్కొచ్చింది చిన్నికి. వాడి కళ్ళలో నీళ్ళు కనిపించిన నాకు జాలేసింది.

"మీరేవింటంటారే"? అనడిగేను మా అమ్మాయిల్ని.

"బ్లాక్ మెనేస్ అంటేనో" అంది అపరాధ పరిశోధక నవలలూ, దెయ్యం సినిమాలూ అలవాటుపడ్డ పార్వతి.

"బ్లాక్ ఏంజల్ అన్నా ఫరవాలేదు" అంది బుజ్జి.

తన కుక్క పేరు విషయంలో ఇంత రగడ జరగడం యిష్టం లేకపోయింది చిన్నికి – "నువ్వే ఏదో ఒకటి నిర్ణయించు నాన్నా" అని ఆయన్ని అడిగేడు వాడు.

"పోనీ దాన్నే అడగరా ఏ పేరు ఇష్టమో" అన్నారు ఆయన.

"అలాక్కాదు, చెప్పునాన్నా" అని మారాం చేశాడు చిన్ని.

"జాక్ అంటే బావుంటేందేమో" అన్నారు ఆయన దొంగనవ్వు నవ్వుతూ. ఆ కిందటి రోజే ఆయన నాకు జాక్ ది రిప్పర్ కేసు గురించి చెప్పేరు. ఆఖరికి జాక్ అన్నపేరు కుక్కతో సహా అందరికీ నచ్చింది. అదేదో పెద్ద డిటెక్టివ్ పేరనుకుంది పార్వతి. ఏ అమెరికన్ రివల్యూషనరీ పేరో అనుకొని తృప్తిపడ్డారు మిగిలిన వాళ్ళు. లండన్లోని డాగ్ షోలో ఫస్ట్ ప్రైజ్ విన్నర్ పేరనుకుని కాలరు ఒకసారి సరిచేసుకుంది మా కుక్క. అప్పటి నుంచీ మేమందరం దాన్ని జాక్ అని, మా చిన్ని మాత్రం మేజర్ అని పిలుస్తున్నాం.

దానికి కొంచెం వయసోచ్చేక నేను కనిపెట్టిన విషయం దానికి ఆడవాళ్ళంటే అంత ఇష్టంలేదని. మా వారు ఇంటిదగ్గర వున్నంతసేపూ ఆయన దగ్గరే వుంటుంది. ఆయన కోర్టుకెళ్ళినా, ఊరేళ్ళినా జవాన్ల దగ్గరుంటుంది. "చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేశానే ఛీ, దీనికి కొంచెం కూడా విశ్వాసం లేదు. ఇది కుక్కల్లో చెడ పుట్టింది' అని నేను అస్తమానూ తిట్టుకుంటాను.

ఆ మధ్య ఎన్.జి.ఓ.ల స్ట్రయిక్ జరిగినప్పుడు జవాన్లువెవరూ పనులకి రాలేదు. ఆయన కోర్టుకి వెళ్ళగానే మా కుక్క చక్కగా సోఫాలో జడ్జీకుండాల్సిన డిగ్నిటీ మేము మైన్‌టైన్ చేస్తున్నామో లేదో తెలీదు కాని మా కుక్క మాత్రం జడ్జిగారి కుక్కకుండాల్సిన డిగ్నిటీ అంతా అతిచక్కగా మైన్‌టైన్‌చేస్తుంది. అదసలు కాన్వెంటులో చదవాల్సినకుక్క. చాలా డల్‌గా పడుకునేది. మొదట్లో నిద్రపోతోందేమో అనుకున్నాను. కానీ తీరా చూస్తే ఒక కన్ను తెరిచి ఏదో ఆలోచిస్తూ ఉండేది, పాపం! వాళ్ళమ్మ జ్ఞాపకం వచ్చిందేమో అనుకున్నాను. ఆ టైములోనే మావారు మూడ్రోజులు ఏదో వూరు వెళ్ళేరు. ఆ మూడ్రోజులూ రెండో కన్ను కూడా మూసేసి పడుకునేది. పడుకొని ఆలోచించేదో, నిద్ర పోయేదో మాత్రం మాతో చెప్పేది కాదు. అంతకు ముందు ఆంధ్రా ఏజిటేషన్ వచ్చిన దగ్గర్నుంచి రెగ్యులర్‌గా ఇంగ్లీష్ న్యూస్ వినేది. ఇప్పుడు న్యూస్‌మానేసి భక్తిరంజని వినడం ప్రారంభించింది. నాలుగో నాడు అది వీధి వరండాలో వుండగా మా కారు హారన్ ముందు వినిపించిన తరువాత కారు కనిపించింది. మామూలుగా అయితే తోకాడిస్తూ కారుకి ఎదురువెళ్ళి ఆయన కారు దిగగానే ఆయన సీట్లోకి అర్జంటుగా గెంతి వెళ్ళి మళ్ళీ అంత అర్జంటుగా కిందికి గెంతి ఆయన కాళ్ళకి చుట్టుకోవడం దానికి అలవాటు.

ఈమారు మాత్రం కారుని చూసి లోపలికి పారిపోయింది. భక్తిగీతాలూ, వైరాగ్యం వంటబట్టేయి కాబోలు అనుకున్నాను. ఆయన ఇంట్లోకి వచ్చిన మూడో, నాలుగో నిమిషాలకి పరుగెత్తుకొచ్చింది. నోట్లో సిగరెట్టుపెట్టె కరచుకొని.

"థాంక్స్ అని సిగరెట్టు పెట్టి తీసుకున్నారు.

"కాల్చు, కాల్చు" అనిపోలీసు హెద్దులా కసిరింది.

ఆయన సిగరెట్టు అంటించినప్పుడు అది సంతోషంతో డాన్స్ చేసింది. తర్వాత ఆయన వడిలోకి యెక్కి కూర్చుని ఒదిలే పొగలో మొహం పెట్టింది. ముక్కుతో పీల్చింది. నూరేళ్ళ తపస్సు చేసిన మునికళ్ళలా దాని కళ్ళు చిద్విలాసంతో నిండిపోయేవి.

దాని గురించి ఇంత చెప్పేక మరో మాట కూడా చెప్పాలి. దానికి అంత నేరో పొలిటికల్ వ్యూస్ వున్నాయని నాకు మొన్నటి దాకా తెలీదు. దానికి 'ఆంధ్రా' ఫీలింగ్ చాలా జాస్తి అనుకుంటాను. (చార్మినార్ సిగరెట్లు అంటే దానికి గిట్టవు) ఆ మధ్యనాకు కొత్త జవాన్ని వేసేరు. వాడు ఇంటికి వచ్చిన దగ్గరనుంచి వెళ్ళిపోయేదాకా ఒక్కలా అరిచేది వాడిమీద. నాలుగురోజులు భరించి, ఐదోరోజుని పాతజవాన్ని సలహా అడిగేడు. ఛార్‌మినార్ సిగరెట్లు దానికి ఇష్టంలేదు. మరోరకం బ్రాండు కాల్చుకో" అని అతను సలహా ఇచ్చేడు. కొత్తవాడు ఇంకేదో బ్రాండ్‌కి మారేడు. ఆ తర్వాత అతనిమీద అంతగా అరిచేది కాదు. కాని అందుబాటు అయినప్పుడు మాత్రం అతని కాలు అందుకునేది. ఒకప్పుడు చార్‌మినార్ సిగరెట్టు కాల్చిన దోషానికి.

సిగరెట్ విషయంలో దాని అభిరుచి మరొక్కటి చెప్పాలి. దానికి ఫారిన్ సిగరెట్లంటే మహామోజు. మా పక్కింటి డాక్టరు గారు ఎప్పుడైనా ఫారిన్ సిగరెట్లు కాలుస్తారు. కాని కాల్చేముందే మా కుక్కకి కబురు చెయ్యరు. అంచేత పాపం అది ఏం చేయగలదు? ఆయన పారేసిన ఫారిన్ సిగరెట్టు పెట్టేలు తెచ్చుకొని పిల్లల డ్రాయర్లో దాచుకుంటుంది.

❖ ❖ ❖

ఈ మధ్య ఏమిటి జరిగిందంటే....

మా అమ్మాయిలు మెడికల్ కాలేజీలో మొన్నే అడుగుపెట్టినా, వైద్యమంతా వచ్చేసిందనుకుంటారు. అనుకున్నంత మాత్రాన ఫరవాలేదు. మామీద ప్రాక్టీసు మొదలు పెట్టేరు. ప్రాక్టీసు ముందు కుక్కమీద మొదలు పెట్టమన్నాను. కుక్క వప్పుకోలేదు. కుక్కంటే వాళ్ళకు అంత అభిమానం.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే కిందటి ఆరం నాలుగు రోజులు వాళ్ళు నాకు వరస లెక్చర్లిచ్చేరు. సిగరెట్లు కాలిస్తే కేన్సరొస్తుందని, కాబట్టి ఆయనచేత సిగరెట్లు మానిపిం చేమని లేదా పైప్ కాల్పించమని. లెక్చర్ వింటున్నట్టు నేను నటించేదాన్ని. మొదటి రెండు రోజులూ విననట్టు మా కుక్క నటించింది.

లెక్చర్ పూర్తయ్యాక ఆయన సిగరెట్టు. పెట్టెలు కొన్ని కనిపించడం మానేశాయి. మొగపిల్లలు కాల్చటం మొదలు పెట్టేరనుకున్నాను. తర్వాత ఆయన సిగరెట్టు అంటించిన దగ్గర్నుంచీ ఆయనమీద అరవడం, కరవ బోవడం మొదలుపెట్టింది మా కుక్క. మొదటిరోజు దీనికి దెయ్యం పట్టిందన్నారు. రెండోరోజు దీన్ని పోలీసులతో చెప్పి కాల్పించేస్తానన్నారు.

"అది కాదు నాన్నా, నిన్ను సిగరెట్ మానీమంటున్నది" అన్నది బుజ్జి. అంటే మా చిన్నది, దానికి కొంచెం ధైర్యం ఎక్కువ వాళ్ళ నాన్న దగ్గర.

"ఇదెవరు నన్ను మానమనడానికి, ఇదేం నాకు సిగరెట్లు కొంటున్నాదా ఏం" అన్నారాయన.

"సిగరెట్ కాలిస్తే కేన్సరొస్తుందట" అది బుజ్జీ.

"ఎవరికి? దానికా? నాకా"

దానికే వస్తుందని దాని భయం. కాని ఆ విషయం ఆయనకి ఎవరూ చెప్పలేదు.

"అదికాదు నాన్నా, అది నిన్ను సిగరెట్లు మానమనడం లేదు, పైప్ కాల్చమంటూంది అన్నాడు చిన్ని. మామూలుగా వాడిసీటు వాళ్ళ నాన్న నెత్తిమీదే.

"నీకెప్పుడొచ్చిందొరే కుక్కభాష" అని విసుక్కున్నారు. ఆయన కుక్కభాష తన స్వంతం అయినట్టు. కానీ ఆయన సిగరెట్లు మానెయ్యలేదు.

తర్వాత వరసగా ఆలయానికి వెళ్ళి ఏవో పురాణం వింది మా కుక్క. (ఇక్కడ మనిషి అంటే కుక్క) పుట్టినవాడు చావక మానడు. చావుకి కారణం కలరా అయితేనేం, కేన్సర్ అయితేనేం? అని గ్రహించి వుంటుంది. తనకీ, ఆయనకీ కేన్సర్ రావాలని ఈశ్వరాజ్ఞ అయితే ఏం చేస్తాం అనుకొని మళ్ళీ మామూలు స్థాయికి వచ్చేసింది సిగరెట్ల విషయంలో.

కుక్కకి ఆయన జ్ఞానోదయం కొంచెం ఆలస్యంతో మావారికి అయింది. మావారు ఏ పురాణాలు, ఏ లెక్చర్లు విన్లేదు కానీ కృష్ణమూర్తి ఆ మాట అనగానే ఆయనలోని పౌరుషం తలెత్తింది. ఈ గుంటడు మానేసినప్పుడు నా అంతటి వాడు మానకపోవడం పెద్ద ఇన్సల్టు అనుకున్నారేమో.

అంచేత ఓ రోజు పొద్దున్నే లేచి "నేనివాళ నుంచి సిగరెట్లు మానేస్తున్నాను" అని డిక్లేర్ చేసారు. ఆయన అలా డిక్లేర్ చేసినప్పుడు మా కుక్క అక్కడే వుంది. అది వెంటనే మావారిమీద కెగిరి మోహం అంతా నాకేసి థాంక్స్ చెప్పింది. కుక్కకున్న పాటి ఇంగిత జ్ఞానం మీలో ఎవ్వరికీ లేకపోయింది అని మా వారు తిట్టేరు కూడాను.

నాకు మాత్రం గుండె పాదాల్లోకి జారిపోయింది. ప్రపంచంలో ఏదీ కూడా మా వారు సిగరెట్టు మానడం లాంటి కష్టంతో ఈక్వల్ కాదు. అది నా స్వానుభవం, ఈ మధ్య ఎప్పుడో ఓసారి "నాకు రాహువులో రాహువు నడుస్తోంది. వాడు మా చెడ్డ చికాకు పెట్టేస్తాడుట. మెల్లిగా ఈ అంతర్దశ దాటేసేవంటే ఆ తరువాత మనల్నింకెవరూ ఆపలేదు. 'పులి' అనుకో. కానీ ఈ పీరియడ్ మాత్రం మన పాట్లు కుక్కలుకూడా పడవు" అన్నారు.

ఇంకేం కుక్కపాట్లు ప్రారంభించేయన్నమాట. ఎంత పనిచేస్తున్నావయ్యా రాహువూ!

ఆవేళ మావారు జడ్జిమెంట్ చెప్పలేకపోయారు. మా కుక్క పాలు తాగలేదు. మా వారికి వంటలో ఏ పదార్థం మంచినీళ్ళతో సహా రుచించలేదు. ఆయన కోర్టుకి వెళ్ళిపోగానే రోజూ అయితే మా కుక్క శుభ్రంగా నిద్రపోయి మళ్ళీ మా కారు హారన్ వినిగాని లేచేది కాదు. ఆవేళ మాత్రం ఇల్లంతా పచార్లు చెయ్యడం ప్రారంభించింది. ఒక్క నిమిషం కూడా నిద్రపోలేదు. ఆ రాత్రి మావారూ, కుక్కా ఇద్దరూ చాలాసేపు కబుర్లుచెప్పుకున్నారు. అందులో ఎక్కువ భాగం సిగరెట్ల గురించే.

ఆ మర్నాడు పొద్దునే మా వారు కాఫీ దగ్గర రెండు కప్పులూ, అన్న దగ్గర మూడు గ్లాసులు ముక్కలు చేసేశారు. మా కుక్క ఎన్నడూ వరండా దిగనిది రోడ్డుమీద పోతున్న ఒక పిల్లినీ, ఒక కుక్కనీ కరిచేసింది. అసలది ఎప్పుడూ అరవదు, కరవదు. ఒకవేళ పిచ్చెత్తడం లేదు కదా అని భయంవేసింది మాకు, మా వారు భోజనం అయిందనిపించేరు. కాని అది మెతుక్కూడా ముట్టకోలేదు. మూడో నాటికి నీరసంతో నడవడానిక్కూడా ఓపిక లేకపోయింది. చచ్చిపోదు కదా భగవంతుడా అని భయం వేసింది మాకు. మా చిన్ని ఏడుస్తూ కూర్చున్నాడు. ఆసుపత్రికి పంపిస్తే జబ్బేమీ లేదు కేవలం మనోవ్యాధి. గాలి మార్పు అవసరం అన్నాడు మెడిసన్ చదువుదా మనుకున్న వెటరినరీ డాక్టరు. ఎవరైనా సైక్రియాట్రిస్టు దగ్గరికి పంపిస్తేనో అనుకున్నాం. కాని కుక్కలకి సైకి యాట్రిస్టు ఉండదుట. తరువాత్తరవాత అదసలు గదిలోంచి బైటికి రావడం మానేసింది. మేమెవరమైనా వెళ్తే మా వైపు అతి జాలిగా కళ్ళనీళ్ళతో చూసి మళ్ళీ పడుకునేది. మా వారు ఆఫీసులో కూర్చుంటున్నారనే గాని కాయితం కదలడం లేదు. రోజూ రెండో, మూడో గాజు గ్లాసులో, యాష్ట్రేలో, మేగజైన్లో ఏవో ఒకటి ఎగిరిపోతున్నాయి. మా ఇంటికి కొత్తగా ఎవరైనా వస్తే "పాపం వీళ్లింట్లో పదిమంది ఒక్కసారి చచ్చిపోయారు కాబోలు" అనుకునేటంత భయంకరంగా తయారైంది పరిస్థితి. ఇటు కుక్క అటు మా వారు ఇద్దరూ దక్కరేమోనన్న భయం పట్టుకుంది మాకు. అంచేత ఇంక ఆవేళ కుక్క ఏదైనా తింటే కాని మేమెవ్వరం మంచినీళ్ళు కూడా ముట్టకూడదని నిర్ణయించుకుని దాన్ని బతిమాలేం. భయపెట్టాం. ముద్దు పెట్టుకున్నాం, మా చిన్ని దాన్ని కావలించుకొని ఏడ్చేశాడు. అయినా దానిలో ఏ మార్పు లేదు, ఒక కడుపు కరిగిపోయే చూపు తప్ప. మా బాధ, కుక్క బాధ చూసినా మా వారు ఏమనుకున్నారో ఏమో "మీరంతా వెళ్ళండి, నేను దాన్ని అన్నానికి తీసుకొస్తాను" అన్నారు, అతి సీరియస్‌గా.

మేమందరం అతి ఆతృతగా బైట నిల్చున్నాం. ఒక అరగంట గడిచింది. లోపలనుండి మా వారు, కుక్క మాటలు సన్నగా వినిపిస్తున్నాయి. కానీ మాకేవీ అర్థంకాలేదు.

ముప్పై ఒకటో నిమిషంలో తలుపు భళ్ళున తెరుచుకుంది. నోట్లో సిగరెట్టు కాలుస్తూ మా వారు వచ్చేరు. మాకుక్క అతని మొహంలో మొహం పెట్టి సిగరెట్టు పొగపీలుస్తూ మొహం అంతా నాకేస్తోంది. కఠోర తపస్సు తరువాత భగవంతుడు ప్రత్యక్షమైతే ఉన్న వెలుగుంది. దాని మొహంలో అంత నీరసం ఏమైపోయిందో చెంగున గెంతి వెళ్ళి అన్నం తినేసింది.

"ఏవిటో, పిచ్చిముండ. దానికోసం కాల్చాలిసొచ్చింది" అన్నారు. మావారు వేదాంతికంగా సిగరెట్టు వేపు చూస్తూ. ఆయన ఆఫీసుకి వెళ్ళేక మా చిన్నితో చెప్పిందట మా కుక్క మా వారు సిగరెట్టు మానేసి పడుతున్న బాధ అది చూడలేక, యజమాని అంత కష్టంలో ఉంటే తను చూడలేక మంచం పట్టేసేనని, నిజానికి దానికి సిగరెట్టులో ఇంటరెస్టు లేదనీని!

**(యువ, దీపావళి 10.11.1973)**